
STUDIO Roopkala
రామకృష్ణా పిక్చర్స్
తారాశశాంకము
నిర్మాత: K. సత్యనారాయణ. B.Sc., * దర్శకత్వం: మానాపురం
(A)
పూర్ణా రిలీజ్..

తారాశశాంకము

* కథా సంగ్రహము *

తార జారిణి కాదు !

తాను నవయవ్వనియైనా స్వీయసౌఖ్యాన్ని వదలుకొని వృద్ధుడైన భర్తను ప్రత్యక్షదైవముగా భావించి పూజించిన పతివ్రత!

లోకకల్యాణార్థం అవతరించిన నవమగ్రహమైన బుధునకు జన్మనిచ్చిన ఆదర్శమాతృదేవత!!

మరి ఆమె జీవితం కళంకిత మగుటకు కారణము లెవరు?

— చదవండి!

త్రిలోకసంచారి నారదు డొకనాడు శ్రీ మహావిష్ణువును సందర్శించి, సమస్తలోకాలలో తలెత్తిన ఈతిబాధలు, అక్రమాలు, అనాచారాలుగూర్చి సంభాషిస్తాడు.... నవమగ్రహముగ బుధుడు జన్మిస్తేగాని గ్రహచక్రం పూర్తి కాదని, లోకాలలో శాంతి ఏర్పడదని, ఆ బుధుడు ఎట్టి తల్లిదండ్రులకు జన్మించవలసిఉన్నదో, వా రెవరో అనే విషయాలను రహస్యంగా నారదునిచెవిని వేసి ఈ మహత్కార్యానికి నారదునే నాందిగా వ్యవహరించ మంటాడు మహావిష్ణువు.

వెంటనే నారదమహర్షి భూలోకానికి వచ్చి, అత్రిఅనసూయదంపతులను పరామర్శించి పుత్రప్రాప్తికోసం సోమదేవుని ఆరాధించమని అనసూయకు హితోపదేశంచేస్తాడు. అనసూయాదేవి సోమదేవుని పూజించి, ఆయనఅంశతో ఒక శుభసమయాన ఒక సుపుత్రుణ్ణి కంటుంది. ఆ బాలుడికి 'చంద్రుడు' అని పేరు పెడతాడు అత్రి మహర్షి.

సమస్తలోకాలలో శాంతి నెలకొల్పడానికి సంకల్పించి దేవేంద్రుడు దేవగురువైన బృహస్పతితో సంప్రదిస్తాడు. అదేసమయంలో అక్కడకు

వచ్చిన నారదుడు వారిసంభాషణలో పాల్గొంటాడు. తాము జరిపించబోయే విశ్వశాంతిమహాసభకు ఎవరెవరిని ఆహ్వానించాలో చెప్పి, రాక్షసగురువైన శుక్రునిమాత్రం ఆహ్వానించవద్దంటాడు బృహస్పతి. సోదరసమానుడైన కచుని ప్రేమించి విఫలయై అతనిని శాపగ్రస్తునిచేసి తదుపరి యయాతి రాజును పెండ్లాడి దేవయాని భ్రష్టురాలైనదని, అట్టి భ్రష్టను కూతురనేమను కారంతో ఆమెపెండ్లి నామోదించినందున శుక్రుడుకూడ భ్రష్టుడైనాడని నిందిస్తాడు దేవగురువు. కలహభోజుడైన నారదుడు బృహస్పతి అన్నమాటలకు చిలవలు పలవలు సృష్టించి శుక్రాచార్యుని చెవిని వేసి అతనికి ఆగ్రహంకలుగజేస్తాడు. తనకూతురికి కళంకంఆపాదించిన బృహస్పతిపై పగసాధిస్తానని ప్రతిజ్ఞచేస్తాడు శుక్రాచార్యుడు. తనపథకం నెరవేరేందుకు అత్రికుమారుడైన చంద్రుణ్ణి విద్యాభ్యాసనిమిత్తం బృహస్పతివద్దకు పంపే ఏర్పాటుచేయించమని నారదుని కోరుతాడు శుక్రుడు. సరేనని నారదమహర్షి తిన్నగా అత్రిఅనసూయలవద్దకు పోయి వారితో సంప్రదించి చంద్రుణ్ణి బృహస్పతిఆశ్రమానికి విద్యాభ్యాసనిమిత్తం పంపే ఏర్పాటు చేస్తాడు.

విద్యార్థియై తనవద్దకు వచ్చిన చంద్రుణ్ణి ఆదరించి అనతికాలంలో వానిని సకలవిద్యాపారంగతుని చేస్తాడు బృహస్పతి.

బృహస్పతి భార్య తారాదేవి అతిలోకసుందరి, నవయవ్వని. సుగుణాలఖని. ఆమె తనసాంసారికసౌఖ్యాన్నివదలుకొని పతిసేవయే పరమార్థమని తలచి సేవించిన పతివ్రత. ఆమె ఒకనాడు చంద్రుని గానము విన్నది. మైమరచి పోయింది. ఆనాటినుండి చంద్రునియందు ఆమెకు అభిమానం ఏర్పడింది. అతని ఆహార, విద్యా విషయాలలో శ్రద్ధాసక్తులు కనపరచేది.

తార నదీస్నానానికివెళ్తూ దారిలో ప్రకృతిసౌందర్యంచూచి ముగ్ధురాలయింది. పూజాకుసుమాలు కోసుకోబోతుంటే ఒక భయంకరమైన నాగుబాము ఆమె పాదాలవద్దకు వెనుకతట్టున వచ్చింది. అదిచూచిన చంద్రుడు

పరుగెత్తి వెళ్ళి తారను నాగుపాముకాటునుండి తప్పించాలని తనవైపు లాక్కుంటాడు. తార కెవ్వుమంటుంది. తనను స్పర్శించినందుకు చంద్రుని మందలించబోయింది. కాని నాగుపామువిషయం తెలిసికొని మౌనంగా తన మందిరానికి వెళ్ళిపోతుంది. ఆకాశమార్గంలో పోతూన్న నారదుడు గమనించి తారాచంద్రులప్రణయజీవితానికి సంఘటన అంకురార్పణ కావించిం దని సంతోషిస్తాడు. పరపురుషస్పర్శపాతక మని లోలోన బాధ పడుతూంది తార.

తారాచంద్రులు ఒకే ఆశ్రమంలో ఉన్నా జీవితాలను పవిత్రంగాగడుపు తున్నారని చెప్పి పనికిమాలిన ప్రతిజ్ఞలు చేయడమెందుకని శుక్రుని దెప్పి పొడిచి అతనిఆగ్రహాన్ని రెచ్చగొడతాడు. వెంటనే శుక్రుడు ఆవేశపరు ఒక శక్తిని తన నేత్రంనుండి సృష్టిస్తాడు. ఆ శక్తి యొక్క మాయా ప్రభావంవలన తార తాను చంద్రునితో ప్రణయశృంగార లీలల్లో తేలినట్టు కలగంటుంది. 'చంద్రా! చంద్రా!' అని తీయగా కలవరిస్తుంది నిద్రలో. అది గమనించిన వసంత తార మానసికంగా బలహీన అయిం దని ఊహించి ఆవిషయం చంద్రునితో సంప్రతించింది. వారిరువురూ కూడ బలుకుకొని ప్రేమసరాగం నెరపుతున్నట్టు తారముందు నటించారు. వారి ప్రేమకలాపాన్ని చూసిన తార నిజమనినమ్మి అసూయపొంది వసంతను, చంద్రుణ్ణి దూషించింది. తమప్రేమకలాపమంతా తారను సక్రమ మార్గంలో పెట్టేందుకు ఆడిన బూటకమని చెప్పింది వసంత – తన మనస్సు బలహీనమైందని గ్రహించి బాధపడింది తార.

దేవేంద్రుని ఆహ్వానంపై మాతలివెంట అమరావతికి బృహస్పతి బయలుదేరబోతూంటే తారకూడా ప్రయాణంకాబోయింది. ఎట్లయినా చంద్రునికి దూరంగా ఉండటమే శ్రేయస్కరమని ఆమె భావించింది.కాని బృహస్పతి ఆమెప్రయాణానికి అంతరాయంచెప్పగా భర్త మాటకు మారు పలుకలేక సరేఅంటుంది తార. తనపరోక్షంలో ఆమెకు సర్వరక్షగా అతని పాదుకలు ప్రసాదించమని తార కోరగా బృహస్పతి పాదుకలను ఆమె కిచ్చి వెళ్తాడు.

చంద్రుని తన మందిరానికి రానీయకుండా ఆంక్షపెట్టి భర్త పాదుకలను తనముందుంచుకొని దేవి చెంత కూర్చొని ధ్యాననిష్ఠలో మునిగిఉంటుంది తార.

ఒంటరిగా ఉన్న తారను వ్రతభంగంచేయడానికి అదేమంచి సమయమని నారదుడు ఉద్బోధించగా శుక్రుడు తనప్రభావంతో మాయాచంద్రుణ్ణి సృష్టించి తారను వ్రతభంగం చేసేందుకు పంపిస్తాడు.

మాయాచంద్రుడు తారను కామపరవశురాలుగా చేయడానికి ప్రయత్నించి విఫలు డౌతాడు. కాని ఎక్కడచూచినా తనకు చంద్రుని రూపమే సాక్షాత్కరిస్తున్నందున తారమనస్సు చలించి శాంతికోసం ఆశ్రమంనుండి వెర్రిదానిలాగా పరుగెడుతుంది. కొంతవరకు సాధించినందుకు మాయా చంద్రుడు తృప్తిగానవ్వి మాయమౌతాడు. ఆశ్రమం విడిచి పరుగెడుతూన్న తారను ఒక పులి వెన్నాడుతుంది. అది గమనించిన నిజచంద్రుడు తారను రక్షించేందుకు విల్లమ్ములు తీసికొని పులిని చంపేందుకు పరుగెత్తాడు. పులిని సంహరించడంతోపాటు ఒక ఆపదకు గురియై గాయపడతాడు చంద్రుడు. శిష్యులు గాయపడిన చంద్రుణ్ణి ఆశ్రమానికి చేరుస్తారు. తనను రక్షించబోయిన చంద్రుడు ప్రమాదానికి గురైనందుకు జాలిపడి తార చంద్రుడికి ఉపచారాలు చేయబోతుంది. తారను పతితను చేయడానికి అదే సమయ మని శుక్రుడు మోహినీశక్తిని తారపై ప్రయోగిస్తాడు. ఆ మాయా శక్తి ప్రభావంవలన తార తనను తామరచి చంద్రునిపై మరులుకొంటుంది. చంద్రుడు తెలివితెచ్చుకొని తార తనయందు ప్రదర్శిస్తున్న అనుచిత కార్యానికి ఆశ్చర్యపడి ఆమెను మందలిస్తాడు. కాని శుక్రుడు చంద్రునిపైన కూడాశక్తిని ప్రయోగించి అతనిమనస్సును మార్చివేస్తాడు. దానితో తారాచంద్రులు ఒకరినొకరు ఆకర్షించుకొని ప్రణయవిలాసాల్లో మునిగి లోకాన్ని మరచిపోతారు. వారిసాంగత్యఫలితంగా బుధుడు జన్మించి తక్కిన గ్రహాల్లో చేరిపోతాడు. గ్రహచక్రం పూర్తి అయినందుకు నారదుడు సంతోషిస్తాడు.

దేవేంద్ర లోకమయిన అమరావతినుండి బృహస్పతి తనఆశ్రమానికి తిరిగి వస్తాడు. ఆయనరాకను చూచిన వసంత కంగారుపడి తారాచంద్రులను కాపాడేందుకు పరుగెత్తి తలుపుతడుతుంది. పారవశ్యంలో ఉన్న తారా చంద్రులకు వసంత పిలుపు వినబడదు. వసంత దొడ్డిదారిని పోయి లోవ ప్రవేశించి తారా చంద్రులకు బృహస్పతి వచ్చాడని తెలియజేస్తుంది. ఆ వార్తతో తారా చంద్రులకు తలపై పిడుగుపడినట్లయింది. అంతలో బైటనుండి బృహస్పతి తలుపు తడతాడు. వసంత తలుపు తీసింది. నవ వధువులాగ వసంత నవమన్మథుడిలాగ చంద్రుడు కన్పిస్తారు. బృహస్పతి ఆశ్చర్యపోతాడు. చంద్రవసంతలను శంకించి మందలించబోతాడు. తారను రక్షించాలనే సదుద్దేశంతో వసంత చంద్రునితో కలిసి తప్పుచేసినట్లు చెప్తుంది. తార మధ్యలో అడ్డుపడి చంద్రునితో కలిసి తాను తప్పు చేసినట్లు ఒప్పుకుంటుంది. తారాశశాంకుల ప్రణయసంఘటన తెలుసుకొన్న బృహస్పతి ప్రళయకాలరుద్రుడిలా మండిపడి వారిని భస్మం చేయబోతాడు. అంతలో శుక్రుడు అక్కడ ప్రత్యక్షమై తారాశశాంకుల పతనానికి కారకుడు తానేనని నిర్భయంగా చెప్తాడు.

తారా చంద్రుల గతి ఏమవుతుంది?

బృహస్పతి, శుక్రుల కలహం

ఎలా ఎవరిచే పరిష్కరింపబడుతుంది!

ఇంతకూ తార పతితా? పతివ్రతా?

తెఱపై చూసి తెలుసుకోండి!

పాటలు - పద్యములు

పాట 1 — రచన : రాజశ్రీ

పాడినవారు : ఘంటసాల

నారద : భళిరా మాయాలోలా శౌరీ! ॥భళిరా॥
ఊహాతీతము నీ లీలా! ॥భళిరా॥
నటనలు చేసి, ఘటనలు మార్చి
ఆడించేదీ నీవా?–
మంచి చేసినా తగవులమారిగ
నిందపడేదీ నేనా? ॥భళిరా॥
గ్రహముల గతికి
మనుజుల స్థితికి
వింతగ పెనుముడి వేశావే! ॥వింతగ॥
చిత్రమైన యీ నాటక మందున
నాందిగ నన్నే చేశావే ॥భళిరా॥

శ్లోకం : — రచన : పురాణ గ్రంథం నుండి

పాడినవారు : లీల

తార : జయహే !
జయ జయహే !
కల మురళీవర వాదిత కూజిత
కోకిల మంజుల మంజురతే !
మిళిత మిళింద
మనోహర గుంభిత

రంజిత శైల నికుంజగతే
మృగ గణ భూత మహాశబరీగణ
రింగణ సంభృత కేళి భృతే!
జయ జయహే ! మహిషాసుర మర్దిని
రమ్యకపర్దిని – శైలసుతే ! జయ జయహే !

పాట 2 రచన : కొసరాజు

పాడినవారు : మాధవపెద్ది, పిఠాపురం, స్వర్ణలత

శాంత : ఏంచేస్తావోయ్ లంబయ్యా!
ఎగిరి పడకురా జంబయ్యా!
లంబు : ఏంచేస్తామో చూస్తావూ
శాంత : అహ్!
జంబు : అపుడే దారికి వస్తావూ!
ఇద్దరు : నీ వపుడే దారికి వస్తావూ!
శాంత : ఆ! ఏం చేస్తావోయ్ లంబయ్యా!
ఎగిరి పడకురా జంబయ్యా!
శాంత : చూచాలే మీ అవతారం
బైటపడెను మీ బండారం
ఇద్దరు : అహ తెలివైందేరా!
శాంత : చూశాలే మీ అవతారం
బైటపడెను మీ బండారం
లంబు : మొనగాడి తనం చూపిస్తాం
జంబు : తెలుసా !
లంబు : మొనగాడి తనం చూపిస్తాం
జంబు : అనుమానమ్మును తీరుస్తాం

ఇద్దరు : నీ అభిమానమ్మును సాధిస్తాం
శాంత : ఆ.... ఏం చేస్తావోయ్ లంబయ్యా!
ఎగిరి పడకురా జంబయ్యా!
శాంత : చూపుల గుర్రా లెవియండి !
కోతలు మాత్రం హెచ్చండి !
ఇద్దరు : ఏహా! మమ్మల్నే?
శాంత : చూపులగుర్రా లెవియండి!
కోతలుమాత్రం హెచ్చండి!
లంబు : చిక్కులు పెట్టే చిలిపి గుర్రముకు,
జంబు : కక్కుల కళ్లెం వేయిస్తాం!
ఇద్దరు : తై, తక్కిట, తకతై, ఆడిస్తాం
శాంత : ఏం చేస్తావోయ్ లంబయ్యా!
ఎగిరి పడకురా జంబయ్యా!
శాంత : ఆగవయ్యా! ఓ దేవయ్యా! వచ్చినదారిన పోవయ్యా!
లంబు : మాటలతోటి, కదలములే
జంబు : ఏయ్! ఏమైనా నిను వదలములే
ఇద్దరు : ఔనన్నదాక, నిను వదలములే
శాంత : ఆఁ ఏం చేస్తావోయ్ లంబయ్యా! ఎగిరి పడకురా జంబయ్యా
॥ఏం చేస్తావోయ్॥
ఇద్దరు : ఓయ్, ఓహోయ్, ఓహేవ్.

బృహస్పతి, శిష్యులు :

శ్లో॥ బ్రాహ్మణోస్య ముఖ మాసీత్
బాహూ రాజాన్య కృతః
ఊరోనదస్య యద్వైశ్యః
పద్భ్యాం శూద్రో అజాయత॥

పద్యం 1 రచన : శేషం వెంకటపతి

పాడినవారు : ఘంటసాల

బృహస్పతి : పదునెనిమిది విద్యలు నిను
చదివించెద, వేయునేల (చంద్రా) జగముల నెందున్
బదులితనికి లేదు
లేదనిపించెద, నిను నాయంతవాని చేసెద చంద్రా!

పాట 3 రచన : రాజశ్రీ

పాడినవారు : సుశీల

తారా : మీరే నా దైవం
మీ కరుణే నా జీవం ॥మీరే॥
నేనే వీణై పలికేను
తీయని రాగం చిలికేనూ
గీతం గానం నా హృదయం
సర్వం మీకే అంకితం ॥మీరే॥
విరులై తలపులు – విరిసేనూ
అలలై ఆశలు పొంగేనూ
వెన్నెల కురిసే ఈ సమయం
కదిలే నాలో ఆనందం ॥మీరే॥

పాట 4 రచన : సి. నారాయణరెడ్డి

పాడినవారు : ఘంటసాల, పి.బి. శ్రీనివాస్

బృహస్పతి : వందే జననీ!
చంద్ర : వందే సుధావాహినీ!
బృహ : వందే కలుషహారిణీ!

చంద్ర : వందే కల్యాణకారిణీ!
బృహ : వాణీ! పావనీ!
చంద్ర : శ్రీవాణీ! – పావనీ!–
బృహ : కలవీణా మృదుపాణీ!
చంద్ర : అలివేణీ అజురాణీ!
ఇద్దరూ : వాణీ! పావనీ! .... శ్రీవాణీ పావనీ!–
బృహ : కమలాసన కమనీయ హృదయ
నవకమల కరికా వాసినీ!–
చంద్ర : సకల చరాచర నిఖిల నరామర
చైతన్య కళా దాయినీ!–
బృహ : శుభకర కవితా రూపిణీ–
చంద్ర : అభినవ కవితా దీపినీ–
ఇద్దరూ : వాణీ – పావనీ! .... శ్రీవాణీ పావనీ-
బృహ : చందన శీతల మంద మంద
మకరంద మధుర సంభాషిణీ!
చంద్ర : నవ్యదివ్య సంగీత సాహితీ
నయనయుగళ సంశోభినీ–
బృహ : రాజస తామస భంజనీ!
చంద్ర : రసమయ మానస రంజనీ!
ఇద్దరూ : వాణీ! పావనీ!
శ్రీవాణీ పావనీ!

పద్యం 2 రచన : కొప్పరపు సుబ్బారావు

పాడినవారు : మాధవపెద్ది, పిఠాపురం, తిలకం

శాంత : తర్క భాష్యముల విద్వాన్ బిరుందతనికి–
జంబు : ఆయ్! వంటలో నాకు విద్వాన్ బిరుందు!

శాంత : లక్ష్యలక్షణ ధనుర్లాఘవం బతనకి–

లంబు : భేష్! భక్ష్యభక్షణ కళాప్రౌఢి నాకు–

జంబు : నాకూ–

శాంత : గంధర్వగాన సంగీత వాసి యతనికి–

లంబు : అబ్బో!

జంబు : వడ్ల దంపుడు పాట వాసి మాకు! సువ్వా!

లంబు : ఆహ సువ్వా!

జంబు : ఓహో సువ్వా!

శాంత : ఛ ఛ! సకలపురాణార్థచర్చలు వానికి,

లంబు : అహహ! శాంతా! శాంతా పురాణమే చర్చ మాకు!

జంబు : ఔ నాను!

శాంత : చనువు, గారాము, ముద్దు ముచ్చట లతనికి!
తిట్లు, మెడనెట్లు , మొట్లు, ఛీవాట్లు మీకు!

ఇద్దరు : అహహ! బాగుంది రబ్బాయ్ బాగుంది!

శాంత : మురిపెముగ పెంచబడ్డ పూమొక్క యతడు,
పంత విడిచిన–

ఇద్దరు : ఆయ్!

శాంత : ఆబోతు జంట మీరు!

ఇద్దరు : ఇ హి హి హి –

పద్యం 3 పాడినవారు : ఘంటసాల రచన : రాజశ్రీ

ఉ॥ ఆరుపదుల్ వయస్సున బృహస్పతి కక్కట పాలుకాగి చ
ల్లారెను–తార కిర్వదివయస్సయినన్ నిజనాథు పాద సే
వారతి ప్రొద్దుపుచ్చుచు ప్రపంచసుఖంబుల నెంచ దట్టి–ఆ

తారకు చంద్రుకున్ నడుమ దాపురమయ్యె విచిత్రపట్ట మే
దారిని సాగనున్నదో కదా మునుముందు కథా క్రమంబికన్

పాట 5 రచన : కీ. శే. సముద్రాల

పాడినవారు : ఘంటసాల, సుశీల

చంద్ర : ఊ అంది అందాల తార–
ఏమంది నా ప్రేమ తార?

తార : మిను మిన్నుల నునులేనవ్వులా
నిను కనుసన్న చేసి రమ్మంది– ॥ఊ అంది॥

చంద్ర : మన సీ నాటికీ విరబూసే నని
మరి యీ రేయి హాయీ రాదని
ఆ(.... ఆ .... ॥మనసీ॥

తార : మరులూరించు రాజువు నీవని
మనసార పాలించు దొరా రమ్మని ॥ఊ అంది॥

తార : ఇక సందీయరా – ఈ సందిళ్ళకు
కంది మందారమాయే చెక్కిలి ॥ఇక సందీయరా॥

చంద్ర : పరమానంద వేళా – ఓ చెలీ
ఇహలోక మోక్షాలు – ఇవేలే!

తార : ఫలియించె యేనాటి నోమొ
లభియించె యీ దివ్యప్రేమ

ఇద్దరు : ఎనగానని – మది తమిదీరని
అనురాగాల గాథా మాదేగా

పద్యం 4 రచన : కొప్పరపు సుబ్బారావు

పాడినవారు : ఏ.పి. కోమల

వసంత : గడెతడ పీవు కన్నులకు
గన్పడ కుంటివ యేని తారతా
తడబడ నేల? యుస్సురని
తారటలాడుచు నిన్ను బిల్వగా
బుడుతల బంపనేల? నిను
బోలిన శిష్యులు గారె యెల్లరున్
చెడిన మనస్సు వృత్తు లివి
చెప్పగ నేలను విప్పి చంద్రుడా!

పద్యం 5 రచన : కొప్పరపు సుబ్బారావు

పాడినవారు : పి బి. శ్రీనివాస్

చంద్రుడు : ప్రేమ యన నెట్టిదో నాకదేమి తెలియు
నా ప్రపంచము, గురువు, గ్రంథములు, విద్య,
తార, నీవు, అంతియేగాక తదితరము
నాకు గనుపింప లేదిన్నినాళ్ల ....
ప్రేమయన యెట్టిదో నా కదేమి తెలియు?

పద్యం 6 రచన : కొప్పరపు సుబ్బారావు

తార పాడినవారు : సుశీల

ఉ॥ చప్పుడు చేయకుండ, గడు చల్లగ ప్రాకుచు వచ్చి, నిద్రమై
దప్పిన వాని చేలమున తాతల దూరిచి కాటువేయు ఆ
సర్పము రీతి, నామనసునందున ఒక్క దురంతభావ మె
ట్లిప్పుడు కాలు పెట్టెనో సఖీ విషమున్ ప్రసరించె నంతటన్.

పద్యం 7

ఉ॥ క్రమమున్ తప్పితినంచు చింత పడనా, కానిమ్ము, నాత్రోవ అ
క్రమమొ, సక్రమమో యధర్మమొ సధర్మంబో, సుధాస్వర్గమో
క్రిమి దుర్గంధ నిబంధనారకమొ, నా కేలా తెగింతున్ ప్రియా
ర్థము, లోకమ్మును ధిక్కరింతు నని ధైర్యంబూననా అక్కటా!

పద్యం 8 రచన : కొప్పరపు పాడినవారు : సుశీల

తార :

చం॥ అవిరళమోహ సంక్షుభితమై అతిరేక పథానువర్తియై
పవలును రేయి చందురునిపై బరువెతుట మానకున్నదీ
యవగుణచిత్తవృత్తి ; పతియా పరదేశము లేగుచుండె, ఏ
మవుదునొ, నాకు నేనే, హృదయమ్మును నమ్మగ జాలనో సఖీ॥

శ్లోకం : పాడినవారు : లీల

తార : లంబ శశిబింబవదనే
కంబుగ్రీవే కఠోరకుచకుంభే
అంబర సమాన మధ్యే
శంబర రిపు వైరిదేవి! మాం పాహి మాం పాహి!

దండకం రచన : కీ. శే. సముద్రాల

శ్రీమన్మహాదేవదేవీ! త్రిలోకైక సంతోషిణీ!
భక్త చింతామణీ! శోక సంహారిణీ
అంబ శర్వాణి లోకైక రక్షామణీ!
ఏ పురా పుణ్యమో, నిన్ను నిత్యంబు పూజించి
నీభవ్యకారుణ్యముంబొంది నే ధన్యతన్ గంటినే
నీదు సంకల్పభాగ్యమ్ముగా, మా వివాహమ్ము భావించి
నా జీవదైవమ్ముగా నాథునిన్ నమ్మి సేవించు
చుంటిన్ పురాణీ!

నా చిత్త సంక్షోభమున్ లోభమున్ దూరమున్
జేయవే! .... ఈ పరీక్షా విధానమ్ములో
నీవే నా అండగానిల్చి నా శీలమున్ బెండు గానీక
రక్షింపవే కటాక్షింపవే
దుష్టవాంఛల్ నివారించి శిక్షింపవే నన్ను
రక్షింపవే! సర్వలోకైక మాతా! దయాసాగరీ,
పాహిమాం! పాహిమాం! పాహీ!

పద్యము 9 రచన : కొప్పరపు సుబ్బారావు
తారా : పాడినవారు : సుశీల

చం॥ అరువదియేండ్ల వృద్ధునకు అన్నియు ఇచ్చి నిరుష్ట నీరసా
వరణములో, నిరాశల ప్రవాసముచేసెడువానికెండి యు
ర్వర బడు పండుటాకునకు ప్రౌఢవయస్క శిరీషపుష్ప సుం
దర సుకుమారి ఆలగుటె, నారక నారక మోయి చంద్రుడా!

పద్యం 10 రచన: శేషం వెంకటపతి పాడినవారు: ఘంటసాల

ఉ॥ వికల చరిత్రుడైన మది వెంగలియైన కురూపి యైననున్
త్రికరణశుద్ధిగా మగడె దేవుడటంచును నిశ్చయించి యొం
డొక డెటువంటివాడైన ఒప్పదు కోరగ సాధ్వి ఇట్లెరుం
గక మది తప్పితేని త్రిజగమ్ములు నిన్ను హసింపకుండునే!

పద్యం 11 రచన: కొప్పరపు పాడినవారు: ఘంటసాల

ఉ॥ చదివితి వెల్ల శాస్త్రములు, సాధ్వివటంచు జగంబునందు-నిం
తదనుక పేరుగాంటివి వినాశనబుద్ధి యిదేల కల్గెనో
ముదితరో నీకు నేడు మన పూర్వచరిత్రల నెందునైననున్
సుదతులు పుత్రులన్ గవయ జూచుట వింటిమె కంటిమే కటా॥

పద్యం 12 రచన: శేషం వెంకటపతి పాడినవారు: సుశీల

సీ॥ కన్నకూతురటంచు నెన్నక, భారతీ
తరుణి గూడడె నీ పితామహుండు?
మేనత్త యను మేరమీరి, రాధిక తోడ
నెనయడే యచట నీ యనుగు బావ?
వదెన యంచు, నొకింత వావిలేకయె, జ్యేష్ఠ
నెలతతో గూడడే, నీ గురుండు?
మునిపత్నియగు, నహల్యను బట్టడే. నీదు
సహపాఠియగు పాకశాసనుండు?

గీ॥ ఇట్టి మీ వారి నడతల కట్టిపెట్టి,
'అమ్మచెల్ల!' న్యాయోక్తుల నాడె దేల?
రార! నాతోడ నింగిలో, రమ్య మేఘ
యవనికల దాగి, దోబూచు లాడుకోర!

పాట 6 రచన : కీ.శే. సముద్రాల రాఘవాచార్య
రంభ-ఊర్వశి : పాడినవారు : సుశీల, లీల

నీకే మాకే తగురా - నీకే మాకే తగురా
మా కౌగిళ్లలో పస తిలకించరా - నవ భోగాలలో, రుచి చూపింతుమా
ముల్లోకాల పాలించు రాజా - నీకే మాకే తగురా ॥నీకే॥
అందములోన పందెము మాదే - అందెలు వేసిన బిరుదులు మావే
అందుకు జాణలు మేమే - నీకే మాకే తగురా ॥నీకే॥
భోగులలోన, మగసిరి నీదే - రసికులలోన - రాజువు, నీవే
సరి సరి వలపుల దేలా! నీకే మాకే తగురా ॥నీకే॥

శ్లోకం : : యామిజాల
ఇంద్రుడు పాడినవారు: ఎ.వి.ఎన్. మూర్తి

శ్లో॥ ప్రాజ్యశ్రీ సుర సామ్రాజ్య
మూల స్తంభాయతే నమః

గురవే సర్వదేవానాం
సదా గీష్పతయే నమః.

పద్యం 13 రచన: రాజశ్రీ పాడినవారు: ఘంటసాల

నారద :

మ॥ అహహా! యెంతటి భాగ్య మీ దినము సంప్రాప్తించె లోకాలకున్
గ్రహచక్రమ్ము ప్రపూర్తి చెందెను, బుధుండావిర్భవించెన్ – నవ
గ్రహమై తారకు చంద్రుకున్ సుతునిగా–కంజాక్షులీలన్ – ముదా
వహమై కూడెను విశ్వశాంతి–యిక తారన్ ఏగతిన్ కాచునో.

పద్యం 14 రచన: కొప్పరపు పాడినవారు : మాధవపెద్ది

బృహస్పతి :

శా॥ ఔరా యెంతటి ద్రోహబుద్ధివిర చంద్రా! కృతీ! పాతకీ!
లేరే లోకమునందు యవ్వనులు? నీ లీలన్ మహోన్మత్తువై
దౌరాత్మ్యంబున తల్లి వంటి గురుకాంతన్ బొందినారే? దురా
చారున్ నిన్నిక బూదిసేతు–చటులస్మద్ఘోర శాపాగ్నికిన్.

పద్యం 15 రచన: కె. సుబ్బారావు, పాడినవారు : సుశీల

తార :

సీ॥ తీర్థయాత్రలటంచు – తిరుగుట కొన్నాళ్లు
జన్నంబు లంచును, గొన్నినాళ్లు.
గురుకులవాసపుగోష్ఠితో కొన్నాళ్లు;

పున్నమ, అమా సంచు కొన్నినాళ్లు,
వ్రతములు, పూజలు, క్రతువులు కొన్నాళ్లు
ఘోరతపస్సులు కొన్నినాళ్లు
జపములు కొన్నాళ్లు, శ్రాద్ధముల్ కొన్నాళ్లు
క్రూరనిష్ఠలతోడ కొన్నినాళ్లు

గీ॥ కాగ – నా ప్రాయమెల్ల యీ కరణి నేగె
ఎన్నడును నీదు కౌగిలి యెరుగనైతి,
నీరు లేనట్టి లతిక యే తీరు బ్రతుక
జాలునో ఊహ సేయుమ, సంయమీంద్ర!

పద్యం 16 రచన : సముద్రాల రామానుజాచార్య

బృహస్పతి : పాడినవారు : మాధవపెద్ది

శా॥ నేనే, శ్రీలలితార్యపాదయుగళీనీరేజ నిత్యానుసం
ధాన, ధ్యాన, విధాన సంఘటిత నానా మంత్ర తంత్రార్థ, వి
జ్ఞాన ప్రౌఢి విరాజ దాంగిరస వంశంబందు జన్మించినన్
ఆ నీచున్, ఖలు, శుక్రుడెంచు నిక బ్రహ్మాస్త్రం బమేయమ్ముగన్

పద్యం 17 రచన : సముద్రాల రామానుజాచార్య

పాడినవారు : కొండల్రావు

శా॥ నేనే దాన దమాది సంయమి, జనానీకోక్త సద్ధర్మ ని
ష్ఠానుష్ఠానపరుండ నేని ఎపుడున్ శాక్తేయ పంచాక్షరీ
ధ్యానం బేమర నేని, వీని, బహు విద్యాగర్వి, ఈ భ్రష్టు, గీ
ర్వాణాచార్యు నడంచు పాశుపత దివ్యాస్త్రంబు దుర్భేద్యమై

- తారాగణం -

శోభన్ బాబు, గుమ్మడి, కాంతారావు, హరనాథ్,
ధూళిపాళ, మిక్కిలినేని, అల్లు రామలింగయ్య,
బాలకృష్ణ, మాస్టర్ రామకృష్ణ, వర్రే సూర్య
నారాయణ, M. సుబ్బరాయులు B. A.
దేవిక, సుకన్య, వాణిశ్రీ, జ్యోతి, రాధిక,
పండరీ భాయి మున్నగువారు.

సాంకేతిక నిపుణులు

మాటలు	కీ. శే. సముద్రాల రాఘవాచార్యులు
పాటలు	కీ. శే. సముద్రాల రామానుజాచార్య, సి.నారాయణరెడ్డి, కొసరాజు, రాజశ్రీ, కొప్పరపు సుబ్బారావు, శేషం వెంకటపతి.
సంగీతం	టి. వి. రాజు
ఛాయ	జె. సత్యనారాయణ
శబ్దం	పి. వి. కోటేశ్వరరావు, రామారావు. (భరణి)
కళ	వి. వి. రాజేంద్రకుమార్ B. A.
కూర్పు	బి. హరినారాయణ
దుస్తులు	బి.అప్పారావు జెమిని రామమూర్తి.
నృత్యం	కె.ఎస్. రెడ్డి, చిన్న & సంపత్, రాజు, జైరాం.
నిర్మాణ-నిర్వహణ	యమ్. సుబ్బరాయలు B. A.
ప్లేబేక్	ఘంటసాల, పి. బి. శ్రీనివాస్, మాధవపెద్ది, పిఠాపురం, కొండలరావు, ఎ.వి.యన్. మూర్తి, సుశీల, లీల, కోమల, స్వర్ణలత, తిలకం.

- సహాయకులు -

అసోసియేట్ డైరెక్టర్	పి. త్యాగరాజు
అసిస్టెంటు	పి. వి. రాజు
ఎడిటింగ్	సిహెచ్. వెంకటేశ్వరరావు
ప్రొడక్షన్	సిహెచ్. నారాయణ
స్టూడియో	భరణి

ఆంధ్రా - పూర్ణా ; సీడెడ్ - గౌరి పిక్చర్ రిలీజ్